క్లుప్తంగా

మహానంది క్షేత్ర భద్రతకు పటిష్ట చర్యలు



ఎస్పీ రఘువీర్‌రెడ్డి దంపతులకు మెమొంటో ఇస్తున్న ఈఓ, చైర్మన్

మహానంది: మహానంది క్షేత్ర భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. మహానందీశ్వర స్వామి దర్శనార్థం సతీసమేతంగా వచ్చిన ఎస్పీ రఘువీర్‌రెడ్డి దంపతులకు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు, మెమొంటో అందించి వేదాశీర్వచనం చేశారు. ఆయన వెంట సీఐ రవీంద్ర, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వేకు రైతులు సహకరించాలి

మహానంది: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సమగ్ర భూసర్వే పనులకు రైతులు సహకరించాలని భూసర్వే విభాగం స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ బి.కామేశ్వరరెడ్డి కోరారు. సోమవారం బొల్లవరం పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ జమాల్‌బీ, వీఆర్‌ఓ చలమయ్య, పంచాయతీ కార్యదర్శి సుమాంజలి, సర్వేయర్లు పాల్గొన్నారు.

తిమ్మాపురం వైద్యాధికారిగా భగవాన్‌దాస్

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌ను బదిలీ చేస్తూ ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయనను నంద్యాల జిల్లా లెప్రసీ ఆస్పత్రి విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో గతంలో ఇదే ఆస్పత్రిలో పనిచేసి ప్రస్తుతం మద్దూరు పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ భగవాన్‌దాస్‌ను నియమించగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు.

ఎమ్మెల్యేతో ఆలయ అధికారుల భేటీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం శ్రీశైలం రావడంతో శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్న మర్యాదపూర్వకంగా కలిశారు. అతిథిగృహంలో ఎమ్మెల్యేతో భేటి అయి శ్రీశైల క్షేత్రాభివృద్ధికి ఇప్పటి వరకు తీసుకున్న పలు చర్యలు, భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వారు వివరించారు.

ధ్రువపత్రాల పరిశీలన

పగిద్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బీరవోలు, సంకిరేణిపల్లె గ్రామాలకు చెందిన నీటి ముంపు నిర్వాసితుల ధ్రువపత్రాలను డిప్యూటీ తహసీల్దార్‌లు రాధ, విజయలక్ష్మి పరిశీలించారు. నష్టపరిహారం పెంచి ఇవ్వాలని బాధితులు లోక్ అదాలత్ కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో బాధితులకు 529 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసు అందుకున్న లబ్ధిదారులు జీవించి ఉన్నట్లయితే అవార్డు కాపీలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్స్, ఆధార్ తదితర ధ్రువపత్రాలను పరిశీలించి వారి చేత సంతకాలు సేకరించామన్నారు. అవార్డు గ్రహీతలు చనిపోయి ఉంటే వారి వారసుల నుంచి ధ్రువపత్రాలను పరిశీంచారు. అలాగే ఈనెల 28వ తేదిన నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో క్యాంప్ నిర్వహిస్తామన్నారు.

పండ్లతోటల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న ఏపీడీ బాలాజీ నాయక్

మిడుతూరు: రైతులు పండ్లతోటల పెంపకం చేపట్టడం లాభదాయకంగా ఉంటుందని క్లస్టర్ ఏపీడీ బాలాజీ నాయక్ అన్నారు. సోమవారం మండలపరిధిలోని 49- బన్నూరు గ్రామంలో పండ్లతోటల పెంపకం, పూల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ జయంతి, ఈసీ నరేష్ పాల్గొన్నారు.

అనుమతులున్న వాటినే విక్రయించాలి

మహానంది: దుకాణదారులు అనుమతులు ఉన్న ఎరువులు, పురుగుల మందులను మాత్రమే విక్రయించాలని వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి అన్నారు. గాజులపల్లెలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు.

ఛత్రపతి మహరాజ్ జయంతి

పాములపాడు: మండల కేంద్రంలో సోమవారం ఛత్రపతి సాహు మహరాజ్ జయంతిని సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

జీవాలు ఉన్నచోటనే వైద్య సేవలు

- అందుబాటులో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలు
- 1962కు ఫోన్ చేస్తే చాలు పశువుల వద్దకు అంబులెన్స్‌లు
- సత్వరం వైద్యం
- రైతన్నలకు తొలగిన కష్టాలు



సంచార వాహనం ద్వారా పశువుకు వైద్యం చేస్తున్న దృశ్యం



మేకకు వ్యాక్సిన్ వేస్తున్న ఆత్మకూరు పశు వైద్యశాల సిబ్బంది

ఆత్మకూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆపదలో ఉన్న వారికి వేగవంతంగా వైద్యం అందించేందుకు 108 సేవలను ప్రవేశపెట్టి ప్రజల మన్నన్న పొందారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి నోరులేని మూగజీవాలకు అత్యంత మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పేరుతో గతేడాది మే 2022న పశువులకు అంబెలెన్స్ సేవలు ప్రవేశపెట్టారు. టోల్ ఫ్రీ నంబరు 1962కు ఫోన్‌చేస్తే చాలు రైతు ముంగిటే వైద్య సేవలు అందిస్తున్నాయి.

నియోజకవర్గంలో రెండు అబులెన్స్‌లు..

అప్పట్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్కొక్క నియోజకర్గానికి ఒక్కో పశు అంబులెన్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గంలో రెండు వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా అంబులెన్స్‌లు సేవలందిస్తున్నాయి. రైతులు 1962కు ఫోన్ చేస్తే చాలు పల్లెపల్లె ముంగిళ్లలో వాలి సత్వరం వైద్యం అందించి పశువులను కాపాడుతున్నాయి. పశువులు, మేకలు, గొర్రెలు అస్వస్థతకు గురైతే పశువైద్యులు అవి ఉన్న చోటుకే వెళ్లి సత్వర వైద్యం అందిస్తున్నారు.

24 గంటలూ అందుబాటులో

మూగజీవాలు అస్వస్థతకు గురైతే రైతులు పడే కష్టాలు అంతా ఇంతా కావు. గతంలో జీవాలు అనారోగ్యానికి గురైతే పల్లెల్లో అయితే ఆకులతో నాటువైద్యం, మండల కేంద్రాలైతే పశువైద్యశాలకు వెళ్లి వైద్యం చేయించేవారు. ప్రస్తుతం ఈ అంబులెన్స్‌సేవలు రావడంతో మూగజీవాలకు 24 గంటల్లోనే వైద్య పరీక్షలు అందుతున్నాయి. అంతేకాకుండా పశువులకు అవసరమైన టీకాలు కూడా వేస్తున్నారు.

నియోజకవర్గంలో ఏడాది కాలంలో సంచార పశు ఆరోగ్య సేవ ద్వారా అందించిన సేవల వివరాలు	
మండలం	- పశు వైద్య సేవలు
ఆత్మకూరు	- 763
వెలుగోడు	- 1,184
బండిఆత్మకూరు	- 777
మహానంది	- 792
నియోజకవర్గంలో అంబులెన్స్‌లు - 2	

శ్రీశైలం నియోజకవర్గంలో పశువుల వైద్య సేవల వివరాలు

ఆత్మకూరు మండలంలో పశువుల అంబులెన్స్ సౌకర్యాలు ప్రారంభమైనప్పటికి నుంచి పశువులకు వేగవంతంగా వైద్య సేవలు అందుతున్నాయి. గతేడాది మే 22 నుంచి గత నెల వరకు 763 కేసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో పశువులు 298, ఆవులు, ఎద్దులు 345, గొర్రెలు 70,మేకలు 40, కుక్కలు 10 ఉన్నాయి. వెలుగోడు మండలంలో ఆవులు, గొర్రెలు, బర్రెలు, కుక్కలు దాదాపు 1,184 కేసులకు వైద్యం అందిచారు. బండి ఆత్మకూరు మండలంలో దాదాపు 777 కేసులు, మహానంది మండలంలో 792 కేసులకు వైద్య సేవలు అందించినట్లు అధికారులు వెల్లడించారు. ఇలా వందల సంఖ్యలో పశువైద్య సిబ్బంది అన్ని వేళలా వైద్యశాలలో అందుబాటులో ఉండి,మూగజీవాలను రక్షిస్తూ మన్ననలు పొందుతున్నారు.

కష్టాలు తొలగాయి



మాకు పశువులు ఉన్నాయి. గతంలో పశువులు అస్వస్థతకు గురైతే పశువైద్యశాలకు తీసుకువెళ్లేందుకు ఎంతో ఇబ్బంది పడ్డాం. ప్రస్తుతం ముఖ్యమంత్రి అంబులెన్స్‌సేవసలు ప్రవేశపెట్టడం ద్వారా పశువుల వద్దకే వైద్య సేవలు అందుతున్నాయి. పశువైద్యశాలకు వెళ్లే బాధలు తప్పాయి. వైద్యాధికారులు మంచి వైద్య సేవలు అందిస్తారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– వెంకటేశ్వరనాయక్, ఎస్ఎస్‌తండా

మూగజీవాలకు సత్వరమే వైద్యసేవలు అందిస్తున్నాం



నోరులేని మూగజీవాలకు వైద్య పరీక్షలు అందించేందుకు రాష్ట్రంలో తొలిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశువులకు అంబులెన్స్ సేవలు ప్రవేశపెట్టారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు అంబులెన్స్‌లు ఇచ్చా రు. ప్రస్తుతం ఆత్మకూరు, వెలుగోడులలో అంబులెన్స్ ద్వారా పాడి పశువులకు, గొర్రెలు, మేక లకు వైద్యం అందిస్తున్నాం. ఫోన్ చేస్తే చాలు తామే వెళ్లి పశువులకు మెరుగైన సేవలు అందిస్తాం.

–అరుణ, పశువైద్య సంచాలకులు, ఆత్మకూరు డివిజన్

నూతన ఎత్తిపోతల పథకం మంజూరుకు వినతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: నూతన ఎత్తిపోతల పథకం మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ విలేకరులతో మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం గడప గడప కార్యక్రమంలో భాగంగా మండ్లెం గ్రామంలో పర్యటించానన్నారు. ఆ సందర్భంగా రైతులు తమకు నూతన ఎత్తిపోతల పథకం మంజూరు చేయించి, బీడు భూములకు సాగునీరు అందించి వలసలు వెళ్లకుండా ఆదుకోవాలని కోరారన్నారు. వారి విజ్ఞప్తి మేరకు మూడు రోజుల క్రితం సీఎంను కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు. మండ్లెం గ్రామంలో 3,923.16ఎకరాలు, తంగడంచ గ్రామంలో 1,339.94ఎకరాల బీడు భూములకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరగా.. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యకార్యదర్శి ధనుంజయరెడ్డిని ఆదేశించారని చెప్పారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ



మొల్ల అబ్దుల్ రహిమాన్ మూడు చక్రాల స్కూటిని అందజేస్తున్న, బైరెడ్డి మల్లికార్జున రెడ్డి

నందికొట్కూరు: ఆపదలో ఉన్న కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు బైరెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని బీ.ఎస్.ఎస్.ఆర్ నగర్‌కు చెందిన మొల్ల అబ్దుల్ రహిమాన్‌కు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు విరిగిపోయింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర శాప్ చైర్మన్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మూడు చక్రాల స్కూటిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ స్కూటిని మొల్ల అబ్దుల్ రహిమాన్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి మల్లికార్జున రెడ్డి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మైనార్టీ సెల్ రీజనల్ కో ఆర్డినేటర్ అబుబక్కర్, మాజీ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు,వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే పాలన

నందికొట్కూరు రూరల్ : ప్రజల ముంగిటకే పాలనను తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బైరెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్పెషల్ ప్యాకేజీ నిధులతో పట్టణాభివృద్ధి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న చంద్రమోహన్‌రావు

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన స్పెషల్ నిధులతో పట్టణాభివృద్ధి సాధ్యమైందని కర్నూలు జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పబ్లిక్ హెల్త్ డివిజన్ అధికారి చంద్రమోహన్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని బీ.ఆర్.ఆర్ నగర్, మారుతీనగర్, హాజీనగర్, బైరెడ్డి నగర్‌లో పర్యటించారు. సీసీ రోడ్ల నిర్మాణాల నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనన్న పట్టణంలోని శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, డీఈ నబిరసూల్, ఏఈ కృష్ణలత, కౌన్సిలర్లు చాంద్‌బాషా, మంగళి కృష్ణ, లాలు, చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, బ్రహ్మయ్య, సన అబ్దుల్లా, రమేష్, తదితరులు ఉన్నారు.

యువత తప్పుదోవ పట్టవద్దు



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: చెడు వ్యసనాలకు అలవాటు పడి యువకులు తప్పుదోవ పట్టవద్దని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సెబ్ ఇన్‌స్పెక్టర్ నాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలో అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. స్థానిక గౌడ్ సెంటర్‌లో విద్యార్థులచే మానవహారాన్ని నిర్వహించి, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఆత్మకూరు, కొత్తపల్లి ఎస్‌ఐలు కృష్ణమూర్తి, మహబూబ్‌బాషా, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోలీసు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక దినోత్సవం నిర్వహించారు. టౌన్ సీఐ విజయభాస్కర్ మాదకద్రవ్యాలపై యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెబ్ సీఐ రమేష్‌రెడ్డి, ఎస్‌ఐ ఎన్వీ రమణ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఖాజా హుసేన్, ఆసిఫ్ బాషా పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలో జీబీఎంఎస్ స్కూల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎస్ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ వలంటరీ హెల్త్ అసోసియేషన్, స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ సచివాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని చైల్డ్ ఫండ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. సీసీ డబ్ల్యూ షాజహాన్ పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

జూపాడుబంగ్లా: ఈనెల 15న నందికొట్కూరు బస్టాండులో తండ్రి కళ్లుగప్పి హైదరాబాదు బస్సు ఎక్కి పరారైన తర్తూరు గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి ప్రవీణ్ ఆచూకీ లభించింది. సోమవారం అతన్ని జూపాడుబంగ్లా తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ వద్ద పోలీసులు సరెండర్ చేశారు. చదువుపై ఆసక్తిలేకపోవటంతో తాను పెద్దపాడు హాస్టల్‌కు వెళ్లకుండా హైదరాబాదు బస్సు ఎక్కి వెళ్లినట్లు ప్రవీణ్ తెలిపాడు.

హార్మోనియం బాక్సు వితరణ

మహానంది: మహానందీశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి నంద్యాలకు చెందిన టి.ప్రసాద్(మార్కెట్ ప్రసాద్) హార్మోనియం బాక్సును విరాళంగా అందించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కళాకారుడు రామయ్యకు అందించారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా కవిత

మహానంది: మహానంది మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా తిమ్మాపురం అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న కవితను ఉన్నతాధికారులు నియమించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కళావతిని గడివేముల మండలానికి బదిలీ చేశారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డీఈ హౌసింగ్ ఏసీ సుబ్బారెడ్డి ఆదేశించారు. సోమవారం హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు అడ్వాన్స్ బిల్లులు ఇస్తున్న విషయాన్ని తెలియజేయాలన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ ప్రమాణస్వీకారం



నూతన మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్, కమిటీ సభ్యులు

ఆత్మకూరు: రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయమని శ్రీశైల నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం నూతన వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ ప్రమాణస్వీకారానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంతవరకు ఏ ప్రభుత్వం అందించని సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిందన్నారు. తెలుగుగంగ కింద వెలుగోడు, మహానంది, బండిఆత్మకూరు మండలాల రైతులు సాగు చేసుకునేందుకు ఎప్పుడు నీరు అవసరమైతే అప్పుడు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

చైర్మన్‌గా బాలస్వామియాదవ్

వ్యవసాయ మార్కెట్‌యార్డు నూతన చైర్మన్‌గా బాలస్వామియాదవ్, వైస్ చైర్మన్‌గా అబ్దుల్ రషీద్‌తో పాటు 15మంది డైరెక్టర్లుగా నూతన కమిటీని ప్రమాణస్వీకారం చేశారు. మార్కెట్‌యార్డు సెక్రెటరీ శ్రీనివాసులు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కన్వీనర్ శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయండి

జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజ్, అభివృద్ధి పనుల తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ సభ్యులు పాల్గొన్నారు.



వెలుగోడు హైస్కూల్‌లో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

వెలుగోడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వాటర్ ప్లాంట్‌కు పూర్వ విద్యార్థుల సహకారంతో షెడ్ ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ హెగ్డే, ఉపాధ్యాయ బృందం శాలువలు పూలమాలతో సన్మానించారు. అదేవిధంగా వెలుగోడు ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, స్టేట్ డైరెక్టర్ శశికళ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, నాయకులు దేశం తిరుపంరెడ్డి, ఇలియాస్‌ఖాన్, సొసైటీ సింగిల్ విండో చైర్మెన్ నాగేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ రమణ, చంద్రశేఖర్ రెడ్డి, కేడీసీసీ డైరెక్టర్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడికి నాలుగు రోజులు జైలుశిక్ష

మహానంది: బండిఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామానికి చెందిన వడ్డె సంజీవకు నాలుగు రోజులు జైలు శిక్ష విధిస్తూ నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సంజీవ గత కొద్దిరోజుల క్రితం మద్యం సేవించి మహానంది ఆలయంలోకి ప్రవేశించడంతో పాటు అల్లరి సృష్టించాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి నాలుగు రోజులు జైలుశిక్ష విధించడంతో సబ్‌జైలుకు పంపించారని చెప్పారు.

రేగడగూడూరులో చోరీలు

వెలుగోడు: మండలంలోని రేగడగూడూరు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున నాలుగు ఇళ్లలో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. గ్రామంలోని ఎస్సీకాలనీలో కుమ్మరి వెంకటేశ్వర్లు, సునీల్, రాజేష్, మిద్దె వెంకటేశ్వర్లు ఇళ్ల తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకొని వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జగన్‌మోహన్ కేసు నమోదు చేసుకొని క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించామన్నారు.

దేవస్థానం ఉద్యోగి ఇంట్లో చోరీయత్నం

శ్రీశైలం: దేవస్థానం నుంచి బదిలీపై వెళ్లిన ఉద్యోగి మల్లికార్జున ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారు. సోమవారం ఉదయం ఆయన బంధువులు మార్నింగ్ వాకింగుకు వెళ్తూ ఇంటివైపు చూడగా కొద్దిగా తలుపు తెరచి ఉండడంతో దగ్గరకు వెళ్లి చూస్తే గొళ్లాన్ని దుండగులు తొలగించి చోరీకి పాల్పడినట్లు గమనించారు. వెంటనే వారు స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్‌ఐ లక్ష్మణరావులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని మొత్తం పరిశీలించారు. శ్రీకాళహస్తిలో ఉన్న మల్లికార్జునకు ఫోన్ చేసి బంగారు, నగదు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించడంతో ఏమిలేవని తెలిపారు.

సారా తయారు చేస్తే కేసులు


నందికొట్కూరు: నాటు సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని టౌన్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలో నాటు సారా విక్రయిస్తున్న నీలిషికారి సోని నుంచి ఐదు లీటర్లు, నీలిషికారి రవీంద్ర వద్ద ఆరు లీటర్ల నాటు సారా సీజ్ చేశారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు టౌన్ సీఐ, ఎస్‌ఐ ఎన్వీ రమణ తెలిపారు.

కోడెదూడపై పెద్దపులి దాడి



కోడెదూడను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వరం సమీపంలోని పాత సిద్ధేశ్వరం పరిసర ప్రాంతంలో సోమవారం వేకుజామున పశువుల నారాయణ అనే వ్యక్తికి చెందిన ఆవుల మందపై పెద్దపులి దాడి చేసి ఓ కోడెదూడను మృత్యువాత పడేలా చేసింది. గ్రామస్తులు స్థానిక ఫారెస్ట్ అధికారి నాగేశ్వరరావుకు సమాచారం తెలియజేశారు. ఆత్మకూర్ డీఎఫ్‌ఓ ఆదేశాల మేరకు ఆత్మకూరు ఫారెస్టు రేంజ్ అధికారి పట్టాభి, ఎఫ్ ఆర్ ఓ యాంటీ కోచింగ్ స్క్వాడ్ సుభాష్ ఆధ్వర్యంలో పాత సిద్ధేశ్వరం పరిసర ప్రాంతంలో, నల్లమల అటవీ ప్రాంతంలో పెద్దపులి పాద ముద్రలు గుర్తించారు. పెద్దపులిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ప్రత్యేక కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పెద్దపులి దాడిలో చనిపోయిన కోడెదూడ యజమానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎఫ్ ఆర్ ఓ పట్టాభి మాట్లాడుతూ.. గ్రామస్తులందరూ భయాందోళన గురికావద్దని, ఫారెస్ట్ అధికారులకు సహకరించాలని కోరారు. గ్రామస్తులు రాత్రివేళల్లో బయటికి రావద్దని సూచించారు.



పులి పాదముద్ర

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి,అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

శ్రీశైలం నుంచి షిర్డీకి పాదయాత్ర



షిర్డీకి చేరుకున్న వెంకటరెడ్డి, మిత్రులు

శ్రీశైలం ప్రాజెక్ట్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి 2024 ఎన్నికల్లో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి చేపట్టిన పాదయాత్ర సోమవారం ముగిసింది. ఈనెల 8న మండల కేంద్రమైన సున్నిపెంట సాయిబాబా దేవాలయం నుంచి షిర్డీ వరకు పాదయాత్రను ప్రారంభించారు. మిత్ర బృందంతో కలిసి కాలినడకన 19 రోజుల పాటు నడిచి షిర్డీ చేరుకున్నట్లు ఫోన్‌లో సాక్షికి సమాచారం ఇచ్చారు. అక్కడ షిర్డీ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు పీఠాన్ని అధిరోహించాలని పూజలు చేసినట్లు తెలిపారు.

అలరించిన భజన కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం వికారాబాద్ జిల్లాకు చెందిన బి.మల్లేశం బృందం వారిచే నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. బి.సాయప్ప, రమేష్, రవి, రాములు, శంకరయ్య, పరమేశ్వర్, రాజు, కిష్టప్ప, వెంకట్, రాములు, రాజు, వీరన్న, శివకుమార్ తదితరులు ఆలపించారు.

శ్రీశైలంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఏఈఓ, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లను, రికార్డు అసిస్టెంట్లను మొత్తం 23మంది ఉద్యోగుల స్థానాలను మార్పు చేశారు.